సాక్షి
మంచిర్యాల

మంగళవారం ¦ 8 ¦ అక్టోబర్ ¦ 2024



పట్టభద్రులకు ఓటు

పట్టభద్రుల ఓటరు నమోదుకు ఎన్నికల సంఘం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మంచిర్యాల కలెక్టరేట్‌లో ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేయగా.. ఆన్‌లైన్‌లోనూ నమోదు చేసుకోవచ్చు. 10లో▸



పండుగపూట పస్తులేనా..?

బల్దియాల్లో ఔట్‌సోర్సింగ్, తాత్కాలిక ఉద్యోగులకు జీతాలు రాక పండుగ పూట పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 11లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0 /25.0

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఆగ్నేయం దిశగా ఈదురు గాలులు బలంగా వీస్తాయి. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి.

సోషల్ మీడియాపై నిఘా



కమిషనరేట్‌లో సోషల్ మీడియా ట్రాకింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాసులు(ఫైల్)

- అసత్య ప్రచారాలపై పోలీసుల చర్యలు
- రెచ్చగొట్టే పోస్టులు చేస్తే జైలుకే..
- ఎస్ఎంటీసీ ప్రారంభం

మంచిర్యాలక్రైం: ఆధునిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో సోషల్ మీడియా వినియోగం సర్వసాధారణమైంది. ప్రతీ ఒక్కరి చేతిలో స్మార్ట్‌ఫోన్‌తో ప్రపంచం కళ్ల ముందు కదులుతోంది. ఈ క్రమంలో తమ అభిప్రాయాలు, ఆలోచనలు పంచుకునేందుకు చాలామంది సామాజిక మాధ్యమాలను వేదికగా మలుచుకోవడం కనిపిస్తోంది. కొద్ది మంది మాత్రం హద్దు మీరి ప్రవర్తిస్తున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న వారి ఆగడాలకు కళ్లెం వేసేందుకు రామగుండం పోలీసు కమిషనరేట్‌లో ఈ ఏడాది ఏప్రిల్ 25న సోషల్ మీడియా ట్రాకింగ్ సెంటర్(ఎస్ఎంటీసీ)ను ఏర్పాటు చేశారు. దీని కోసం ప్రత్యేకంగా ఓ బృందాన్ని ఏర్పాటు చేసి అన్ని సామాజిక మాధ్యమాలు, వాట్సాప్ గ్రూపులపై నిఘా ఉంచారు.

150కి పైగా కేసులు

సోషల్ మీడియా వేదికగా చేసుకుని తమ కార్యకలాపాలు సాగిస్తున్న వారిపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా పోస్టులు చేసేవారిని గుర్తించేందుకు ప్రత్యేక బృందాలు పని చేస్తున్నాయి. జిల్లాలో ఇప్పటివరకు 150కి పైగా కేసులు నమోదైనట్లు తెలుస్తోంది. పలువురిని అదుపులోకి తీసుకుని వారిపై కేసులు నమోదు చేసి ఇకనైనా పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. వారితో కాంటాక్ట్‌లో ఉన్న వారి సెల్‌ఫోన్ నంబర్లు సేకరించి వారి జాబితాను సైతం సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. సోషల్ మీడియాలో తమ అభిమాన రాజకీయ నాయకులపై ఇతర పార్టీకి చెందిన నాయకులు విమర్శలు చేయడం, వాటిపై కార్యకర్తలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం, కొన్ని సందర్భాల్లో ఉద్వేగాలకు లోనవుతున్న కొందరు హద్దు మీరి తమ పరిధిని విస్మరిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా పోస్టులు చేస్తున్నారు. ఇలాంటి పోస్టులపై ప్రత్యేక పోలీసుల బృందం ఓ కన్నేసి ఉంచుతోంది. సామాజిక మాధ్యమాలతోపాటు రౌడీలు, ఆకతాయిలు, మందుబాబులు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించడం, వారి వివరాలు సేకరించడం చేస్తున్నారు.

శాంతిభద్రతలకు భంగం కలిగించొద్దు



సోషల్ మీడియా మానవ సంబంధాలను కలిపే విధంగా ఉండాలి. ఒక వర్గానికో, ఒక మతానికో, రాజకీయ వ్యక్తిగత విమర్శలు పోస్ట్ చేసి శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా ఉండకూడదు. యూట్యూబ్, వాట్సాప్, సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలకు వేదికగా ఉపయోగిస్తున్నారు. చట్టవ్యతిరేకమైన పోస్టులు పెట్టిన వారిపై కేసులు నమోదు చేస్తాం. వాట్సాప్ గ్రూప్‌ల్లో పోస్టులు పెట్టిన వారిపై, అడ్మిన్‌లపై సైతం కేసులు నమోదు చేస్తాం. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్ 2000 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. వాట్సాప్ గ్రూప్‌లు సమాచారాన్ని అందించే విధంగా ఉండాలి.

– ఎగ్గడి భాస్కర్, డీసీపీ, మంచిర్యాల

అనేకమందికి ఇబ్బందులు

సోషల్ మీడియాలో ఎవరికి వారు తమ ఆలోచనలను పొందుపరుస్తున్నారు. కొందరైతే కొన్ని వర్గాలు, రాజకీయ పార్టీల నాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నారు. మరికొందరు మహిళలు, యువతులను కించపర్చేలా వ్యవహరిస్తున్నారు. కుప్పలు తెప్పలుగా పుట్టుకు వస్తున్న యూట్యూబ్ చానళ్లు కూడా కొన్ని ఇదే పంథాలో వెళ్తున్నాయి. ఈ పరిణామాలతో అనేక మందికి ఏది అసత్యమో.. ఏది నిజమో తెలియక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీరిలో అతి తక్కువ మంది మాత్రమే పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. దీన్ని అలుసుగా తీసుకుంటున్న అనేక మంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై సోషల్ మీడియా ద్వారా అసత్యప్రచారం చేస్తూ అవమానపరిచే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదుతో మంచిర్యాల పోలీసులు స్థానిక బీఆర్ఎస్ సీనియర్ నాయకుడిపై కేసు నమోదు చేశారు.
- బీఆర్ఎస్ పార్టీకి చెందిన పెద్దపల్లి మాజీ ఎంపీ ఓ మహిళను పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడంటూ మహిళ సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయడంతో సదరు నాయకుడు అసత్య ప్రచారం అంటూ మంచిర్యాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన స్థానిక పోలీసులు విచారణ అనంతరం సదరు మహిళపై, ఆమెకు సహకరించిన మరో మహిళపై సైతం కేసు నమోదు చేసి జైలుకు పంపించారు.
- జన్నారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇందన్‌పెల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తిరుపతి లడ్డుపై వివాదాస్పదమైన వ్యాఖ్యలు జన్నారం వాట్సాప్ గ్రూప్‌లో షేర్ చేశాడు. వివాదాలకు కారణమయ్యే విధంగా రెచ్చగొట్టేలా పోస్ట్ చేసినందుకు జన్నారానికి వ్యక్తి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

న్యూస్‌రీల్

ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రం



దరఖాస్తులు స్వీకరిస్తున్న సిబ్బంది

మంచిర్యాలఅగ్రికల్చర్: ఉపాధ్యాయ, పట్టభద్రుల ఓటరు నమోదుకు కలెక్టరేట్‌లో ప్రత్యేక ఓటర్ నమోదు కేంద్రం ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగానికి అర్హులైన వారు ఓటు నమోదు చేసుకోవాలని, పట్టభద్రులు ఫారం 18, ఉపాధ్యాయులు ఫారం 19 ద్వారా వివరాలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు ఫారాలను నింపి పాస్‌ఫొటో, సంబంధిత ధ్రువపత్రాలు జత చేసి తహసీల్దార్ కార్యాలయం, కలెక్టరేట్‌లో సమర్పించాలని, ఆన్‌లైన్‌లో సీఈవో తెలంగాణ వెబ్‌సైట్‌లో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. నవంబర్ 5వ తేదీ వరకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'పాతపెన్షన్ విధానం హామీని నిలబెట్టుకోవాలి'



సమావేశంలో మాట్లాడుతున్న కమలాకర్

జన్నారం: ఉద్యోగ, ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలుపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినందున ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్ డిమాండ్ చేశారు. సోమవారం జన్నారంలో నిర్వహించిన ఉద్యోగ, ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మెనిఫెస్టోలో పాత పెన్షన్ విధానం అమలుపై పొందుపర్చిందని తెలిపారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేశారని పేర్కొన్నారు. పాత పెన్షన్ విధానం వర్తింపజేస్తూ జీవో విడుదల చేసి దసరా పండుగ కానుకగా ఇవ్వాలని కోరారు. ఎంతోకాలంగా పెండింగ్‌లో ఏకీకృత సర్వీసు రూల్స్ ఏర్పాటు చేసి విద్యావ్యవస్థను బలోపేతం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షుడు బానవత్ ప్రకాశ్‌నాయక్, ఉపాధ్యక్షుడు కాంతయ్య పాల్గొన్నారు.

'యుద్ధదాడులు నిలిపివేయాలి'



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: మధ్య ఆసియా పాలస్తీనా గాజాపై ఇజ్రాయెల్ యుద్ధ దాడులు నిలిపి వేయాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా వద్ద ఇజ్రాయెల్, అమెరికా దిష్టిబొమ్మలు దహనం చేశారు. ఈ సందర్భంగా వామపక్ష పార్టీల నాయకులు మాట్లాడుతూ యుద్ధం కారణంగా ఇప్పటికే 50 వేల మంది ప్రజలు చనిపోయారని, పిల్లలు, స్త్రీలను లక్ష్యంగా చేసుకుని గాజా ప్రాంతాన్ని ఇజ్రాయెల్ శ్మశాన భూమిగా మార్చిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు టీ.శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి లాల్‌కుమార్, సీపీఐ పట్టణ కార్యదర్శి ఖలిందర్ అలీఖాన్, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ఏఐకేఎంఎస్ నాయకులు ప్రభాకర్ పాల్గొన్నారు.

రిటైర్డ్ కార్మికులకు లాభాల వాటా చెల్లించాలి

నస్పూర్: సింగరేణి కార్మికులతోపాటు ఇటీవల పదవీ విరమణ పొందిన కార్మికులకు లాభాల వాటా చెల్లించాలని ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ ఏరియా బ్రాంచి కార్యదర్శి ఎస్కే బాజీసైదా ఒక ప్రకటలో డిమాండ్ చేశారు. లాభాలా వాటాతోపాటు దీపావళి బోనస్‌ను ఇటీవల అన్‌ఫిట్, రిటైర్డ్ కార్మికులకు వెంటనే చెల్లించాలని పేర్కొన్నారు.

షెడ్యూల్డ్ తెగల ప్రాంతాభివృద్ధికి చర్యలు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్‌కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో షెడ్యూల్డ్ తెగల ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జెడ్పీ సీఈవో గణపతి, డీపీవో వెంకటేశ్వర్‌రావు, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి గంగారంలతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ షెడ్యూల్డ్ తెగల ప్రాంతాల్లో చేపట్టే అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుకు ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. వంగిన, విరిగిన విద్యుత్ స్తంభాలు, వేలాడేతీగలు, సబ్‌స్టేషన్ల ఏర్పాటు, త్రీఫేజ్ ఇతర సమస్యలు, నివాసాలకు విద్యుత్ కనెక్షన్ల వివరాలతో నివేదిక రూపొందించాలని అన్నారు. జిల్లాలో కనీసం 500 మంది జనాభా కలిగిన గ్రామాల్లో 50శాతం కంటే ఎక్కువ షెడ్యూల్డ్ తెగలు ఉన్న గ్రామాలను గుర్తించామని, దండేపల్లి మండలం తానిమడుగు, రాజగూడ, కర్ణపేట, లింగాపూర్, హాజీపూర్ మండలం చిన్నగోపాల్‌పూర్, జన్నారం మండలం లోత్‌ఒర్రె, హాస్టల్‌తండా, కొత్తపేట, మల్యాల్, సింగరాయిపేట, కాసిపేట మండలం మామిడిగూడ, గట్రాపల్లి, లంబడితండా(కే), లంబడితండా(డి), సోనాపూర్, వెంకటపూర్, మద్దిగూడ, మందమర్రి మండలం పులిమడుగు, నెన్నెల మండలం కొత్తూర్, నర్వాయిపేట, జంగల్‌పేట, వేమనపల్లి మండలం నాగారం గ్రామాలు ఉన్నాయని తెలిపారు. ఈ స మావేశంలో ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, జిల్లా సంక్షేమ శాఖ సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, విద్యుత్ శాఖ ఏడీఈ బాలకృష్ణ పాల్గొన్నారు.

గాంధారి మైసమ్మకు వెండి ఆభరణాలు బహూకరణ



వెండి ఆభరణాలు శుద్ధి చేస్తున్న పూజారులు

మందమర్రిరూరల్(రామకృష్ణాపూర్): మందమర్రి మండలం బొక్కలగుట్ట వాగు సమీపంలోని గాంధారి మైసమ్మకు అందుగులపేటలోని వాసవీ రైస్‌మిల్లు యజమానులు మూడు కిలోల పావు వెండి ఆభరణాల తొడుగులను సోమవారం ఆలయ కమిటీకి బహూకరించారు. రైస్‌మిల్లు యజమానులు చిలువేరు శ్రీనివాస్, రవీందర్, మణికాంత్, ప్రవీణ్, కొటారపు నరేందర్ ఈ ఆభరణాలు అప్పగించారు. పూజారులు వాటిని శుద్ధీకరించి అమ్మవారి ప్రతిమకు అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు తిరుపతి, ఆలయ కమిటీ అధ్యక్షుడు సుధాకర్ పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా వైద్య శిబిరాలు



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

మంచిర్యాలటౌన్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేలా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్ తెలి పారు. జిల్లా కేంద్రంలోని 7వ వార్డు ఎన్టీఆర్ నగర్ కాలనీలో పాత మంచిర్యాల అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రబలుతున్న జ్వరాలు, అసంక్రమణ వ్యాధుల నివారణ, ఆయా వ్యాధులను గుర్తించి చికిత్స అందించేందుకు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పొగాకు వాడడం వల్ల క్యాన్సర్ వంటి భయంకరమైన వ్యాధులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. షుగర్, బీపీ, క్యాన్సర్ వంటి వ్యాధులు ఎక్కువగా వస్తున్నందున జీవనశైలిలో మార్పులు తెచ్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ప్రకాశ్‌నాయక్, మంచిర్యాల డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత, డాక్టర్ అనిల్, డాక్టర్ కృపాబాయి, డాక్టర్ శివ ప్రతాప్, డాక్టర్ రమ్య, డాక్టర్ శేఖర్, ఆర్‌బీఎస్‌కే సిబ్బంది, పాతమంచిర్యాల అర్బన్ హెల్త్ సెంటర్ వైద్య సిబ్బంది, డెమో బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, శిక్షణ పోలీస్ కానిస్టేబుళ్లు



సీఎం కప్ టార్చ్‌తో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఈ నెల 3 నుంచి రాష్ట్రంలోని జిల్లాలను కలుపుతూ ప్రారంభించిన సీఎం కప్ టార్చ్ ర్యాలీ జిల్లాలో కొనసాగింది. సోమవారం జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తాలో ప్రారంభమైన ర్యాలీ నస్పూర్‌లో సమీకృత కలెక్టరేట్ వద్ద ముగిసిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, 13వ బెటాలియన్ కమాండెంట్ వెంకటరాములు, డీఎస్పీ నాగేశ్వర్‌రావు, శిక్షణ పోలీస్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ అలెక్స్, నోడల్ అధికారి జిల్లా యువజన క్రీడ అధికారి కీర్తి రాజ్‌వీరు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు సత్వరమే పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజావాణిలో ఆయా శాఖల్లో వచ్చిన అర్జీలు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పెండింగ్‌లో ఉన్న అర్జీలు పరిష్కరించాలని సూచించారు. భూ సమస్యలు, పింఛన్, భూ పరిహారం, జీరో విద్యుత్ బిల్లు, తదితర సమస్యలపై అర్జీలు అందజేశారు. నస్పూర్ తోళ్లవాగును ఆక్రమించి నిర్మించిన కట్టడాలను తొలగించి పరిసర ప్రాంతాల ప్రజలను వరద ముప్పు నుంచి రక్షించాలని ఆప్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్రప్రసాద్ కోరారు. దివ్యాంగుడినైన తాను పింఛన్‌తోనే బతుకుతున్నానని, ఎనిమిది నెలలుగా పింఛన్ రావడం లేదని, సదరం సర్టిఫికెట్ రెన్యూవల్ కోసం మీ సేవకు వెళ్తే సర్వర్ పనిచేయడం లేదని ఊరు శ్రీరాంపూర్‌కు చెందిన శ్రీమూర్తి ప్రదీప్ విన్నవించాడు. మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు రాములు, హరికృష్ణ పాల్గొన్నారు.

చేపలు పట్టేందుకు అనుమతి ఇవ్వాలి



భీమారం మండలం గొల్లవాగు ప్రాజెక్టులో చేపలు పట్టేందుకు స్థానిక సొసైటీ సభ్యులకు కాకుండా ఇతర ప్రైవేట్ వ్యక్తులకు అక్రమంగా టెండర్ ద్వారా చేపల పట్టేందుకు కాంట్రాక్టు ఇవ్వడం సరికాదు. సొసైటీ సభ్యులకు కాకుండా ఇతర సభ్యులు చేపలు పట్టుకునేందుకు అనుమతించరాదు. అక్రమ టెండర్లను నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలి. స్థానిక సొసైటీ సభ్యులకే అవకాశం కల్పించాలి. భీమారం బస్టాండ్ ప్రాంతంలో చేపలు మార్కెట్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలి.

– భీమారం మత్స్యకారులు, సొసైటీ సభ్యులు

పోస్టులు భర్తీ చేయాలి



గత 35ఏళ్లుగా వివిధ ప్రభుత్వాలు నిర్వహించిన డీఎస్సీ ఆర్ట్సలలో ఖాళీగా ఉన్న 1733 ఆర్ట్స్, క్రాఫ్ట్, మ్యూజిక్ పోస్టులను ఈ డీఎస్సీలోనైనా భర్తీ చేయాలి. ఏళ్ల తరబడి లోయర్, హయ్యర్, టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్ కోర్స్ బీఎఫ్ఏ, ఎంఎఫ్ఏ పూర్తి చేసిన ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ నిరుద్యోగులు ఉన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గుర్తించి పోస్టులు భర్తీ చేసి ఆదుకోవాలి.

– తెలంగాణ ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ నిరుద్యోగ సంఘం నాయకులు

గోశాలకు స్థలం కేటాయించాలి



జిల్లాలో ఆవులు, ఎద్దులు రోడ్లపై తిరుగుతున్నాయి. వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కొంతమంది ముఠా అక్రమ విక్రయాలకు పాల్పడుతున్నారు. వాటి సంరక్షణ కోసం ప్రభుత్వం మంచిర్యాలలో గోశాలకు స్థలం కేటాయించాలి.

– జిల్లా మూగజీవుల సేవా సంఘం నాయకులు

నష్ట పరిహారం అందించాలి



పడ్తనపల్లి గ్రామంలో మా నివాసం ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణంలో ముంపునకు గురైంది. ఇందిరమ్మ ఇళ్ల కింద ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం రూ.70 వేలు ఇప్పటి వరకు చెల్లించలేదు. ఏళ్లు గడుస్తుండడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా. పరిహారం మంజూరు చేయాలి.

– ఒడ్నాల సత్తయ్య, గ్రామం: పడ్తనపల్లి, మం: హాజీపూర్

బెంగాలీల అకాల బోధన్



బెంగాలీల ఆధ్వర్యంలో ప్రతిష్ఠించనున్న దుర్గామాత ప్రతిమలు

- నేటి నుంచి దుర్గామాత ఉత్సవాలు
- ఐదురోజులపాటు ప్రత్యేక పూజలు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో స్థిరపడిన బెంగాలీ కాందిశీకులు తమ ఆరాధ్యదైవం కాళీమాతాకు మరో రూపమైన దుర్గాదేవిని ప్రత్యేకంగా కొలుస్తారు. అకాల బోధన్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు సిద్ధం అయ్యారు. ఇందుకోసం స్థానిక విశ్వనాథ ఆలయ కాలక్షేప మండపం ముస్తాబవుతోంది. సర్వజననీ దుర్గాదేవి నిర్వహక మండలి ఆధ్వర్యంలో ఈ నెల 8నుంచి ఐదు రోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. ప్రధాన దేవతామూర్తి దుర్గాదేవిని శక్తి స్వరూపిణిని అయిన త్రినేత్రిగా భావిస్తారు. పార్వతికి ప్రతిరూపమైన దుర్గాదేవితోపాటు పలు దేవతల విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు చేస్తారు. దుర్గాదేవి దశావతారమైన అదృశ్య రూపానికి గుర్తుగా అరటి చెట్టు కాండం ఆకులను చీరకట్టి అలకరించి పూజ చేస్తారు. 16 ఏళ్లుగా సర్వజనసీ దుర్గాదేవి(పూజా) ఆధ్వర్యంలో నిర్వహించే ఉత్సవాలకు వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన బెంగాలీలు తరలివస్తారు. కోల్‌కతా నగరంలో ప్రతిష్ఠించే కాళీమాతా విగ్రహాన్ని పోలిన విధంగా ఇక్కడ అదే తరహా ప్రతిమలు తయారు చేయిస్తున్నారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లోని ఈజ్‌గాంకు చెందిన కళాకారుల చేతుల మీదుగా విగ్రహాలు రూపుదిద్దుకున్నాయి. ఐదో రోజు దుర్గాదేవి దశమి పూజా, జమ్మి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. మరుసటి రోజు దేవతా విగ్రహాల శోభాయాత్ర నిర్వహించి గోదావరిలో నిమజ్జనం చేస్తారు.

'అడవుల రక్షణలో భాగస్వాములవుదాం'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

జన్నారం: అడవులు, వన్యప్రాణుల రక్షణలో భాగస్వాములవుదామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం జన్నారం అటవీ డివిజన్ కేంద్రంలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెక్షన్, బీట్ అధికారుల క్వార్టర్లను ప్రారంభించారు. అనంతరం కామన్‌పల్లిలో ప్రైమరీ హెల్త్ సెంటర్, పొనకల్, తపాలపూర్, రోటిగూడ, చింతగూడలో డ్రెయినేజీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అడవులు అంతరిస్తే వర్షాలు సకాలంలో కురువక ఇబ్బందులు ఏర్పడుతాయని తెలిపారు. ప్రస్తుతం వాతావరణంలో మార్పులకు అడవుల నరికివేత కారణమని, వాతావరణ కలుషితం , కాలుష్యం తగ్గడానికి అడవులు విరివిగా పెంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ అధికారి సుష్మారావు, డీఆర్వో తిరుపతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముజాహిద్ అలీఖాన్, ప్రధాన కార్యదర్శి మాణిక్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రం మోహన్‌రెడ్డి, సీనియర్ నాయకులు రాజశేఖర్, ఇసాక్, రాజన్న, ఫసీఉల్లా, శుభాష్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రియాజొద్దీన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్రికెట్ ఆడుతూ పూర్వ విద్యార్థి మృతి


లక్ష్మీనారాయణ (ఫైల్)

తాండూర్(బెల్లంపల్లి): క్రికెట్ ఆ డుతూ పూర్వ విద్యార్థి మృతి చెందిన విషాదకర సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... తాండూర్ మండలంలోని విద్యాభారతి పాఠశాలలో 1999 నుంచి 2012 వరకు చదువుకున్న విద్యార్థులు 'విద్యాభారతి బలగం' పేరిట శనివారం నుంచి క్రికెట్ ఆడుతున్నారు. సోమవారం తాండూర్ గ్రామ పంచాయతీలోని బారేవాడకు చెందిన రాచకొండ లక్ష్మీనారాయణ (38) క్రికెట్ ఆడుతూ అస్వస్థతకు గురికావడంతో స్పృహతప్పి కిందపడిపోయాడు. వెంటనే బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అప్పటి వరకు తమతో ఉత్సాహంగా ఆడిన సహచరుడు కళ్లముందే మృతి చెందడంతో మిత్రులంతా కన్నీటి పర్యంతమయ్యారు. మృతునికి భార్య, కూతురు ఉన్నారు.

బావిలో పడి మహిళ మృతి

బెజ్జూర్: ప్రమాదవశాత్తు బావిలో పడి మహిళ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్సై మోహన్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని లంబాడిగూడెంకు చెందిన అల్లూరి లింగయ్య, లక్ష్మి (44) దంపతులు తమ చేనులో పత్తి పంట వేశారు. చీడపీడల నివారణ కోసం సోమవారం మందు పిచికారి చేశారు. ఈ క్రమంలో చేనులోని బావి వద్దకు నీటి కోసం వెళ్లిన లక్ష్మి నీటిని తోడుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడిపోయింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై వివరించారు.

మహిళ ఆత్మహత్య

లక్సెట్టిపేట(మంచిర్యాల): ఉరేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని హన్మంతుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని చెల్లంపేటకు చెందిన జైనేని భీమక్క (35)కు అదే గ్రామానికి చెందిన రవితో ఇరవై ఏళ్లక్రితం వివాహమైంది. దంపతులిద్దరూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈక్రమంలో ఇద్దరూ కలిసి మద్యం సేవిస్తూ తరచూ గొడవపడేవారు. ఈ నెల 6న ఇద్దరూ మద్యం సేవించి గొడవపడడంతో భర్తను కొట్టి ఇంట్లోకి వెళ్లి ఉరేసుకుంది. మృతురాలి సోదరుడు రాజన్న ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.


వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఎంపీ పూజలు


ఎంపీని సన్మానిస్తున్న గ్రామస్తులు

నార్నూర్: మండలంలోని మహాగావ్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఎంపీ నగేశ్ ప్రత్యేక పూజలు చేశారు. గత ఎన్నికల్లో ఎంపీగా నగేశ్ గెలవాలని గ్రామస్తులు మొక్కుకున్నారు. ఆ మొక్కు తీర్చుకునేందుకు వచ్చిన ఎంపీకి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జాదవ్ రెడ్డి నాయక్, భిక్షపతి రాథోడ్, దేవదాస్, పరశురాం, పాల్గొన్నారు.

పట్టభద్రులకు ఓటు

- ప్రారంభమైన దరఖాస్తుల ప్రక్రియ
- నవంబర్ 6వరకు గడువు
- ఉమ్మడి జిల్లాలో కరువైన అవగాహన కార్యక్రమాలు



కైలాస్‌నగర్: మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రులు, టీచర్స్ నియోజకవర్గ ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించిన ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆయా వర్గాల వారు ఓటరుగా తమపేరు నమోదు చేసుకునేందుకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానంలోనూ ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. డిగ్రీ ఉత్తీర్ణులైన పట్టభద్రులు గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో, టీచర్లు, జూనియర్ లెక్చరర్స్, డిగ్రీ లెక్చరర్స్, యూడైస్‌లో నమోదు చేసుకున్న ప్రైవేట్ పాఠశాలల టీచర్లు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు అవకాశం ఉంటుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పట్టభద్రులు, టీచర్లు అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ ఓటరుగా నమోదుపై మాత్రం అంతగా ఆసక్తి చూపడం లేదు. ఇందుకు గత ఎన్నికల్లో ఓటర్లుగా నమోదు చేసుకున్నవారి వివరాలే నిదర్శనం. ఓటరు నమోదు ప్రక్రియపై అధికారులు సరైన ప్రచారం కల్పించకపోవడం, అభ్యర్థులకు అవగాహన లేకపోవడంతో నమోదుపై వారు అంతగా దృష్టి సారించడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నవంబర్ 6 వరకు గడువు

ప్రస్తుతం పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న జీవన్‌రెడ్డి, రఘోత్తమరెడ్డి పదవీ కాలం వచ్చే ఏడాది మార్చి 29తో ముగియనుంది. దీంతో ఆ ఎన్నికకు త్వరలోనే నోటిఫికేషన్ వెలువడే అవకాశముంది. అందుకు ఓటర్ల జాబితా కీలకం కానుండడంతో కేంద్ర ఎన్నికల సంఘం ఓటరు నమోదు జాబితా రూపకల్పనకు ఆదేశాలు జారీ చేసింది. గత నెల 30 నుంచి ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభించింది. నవంబర్ 6వ తేదీ వరకు గడువు విధించింది. కాగా దరఖాస్తులపై అభ్యంతరాలు, ఆక్షేపణలు ఉంటే 2024 నవంబర్ 23 నుంచి 2024 డిసెంబర్ 9వ తేదీ వరకు ఇందుకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈ ఏడాది డిసెంబర్ 30వ తేదీన తుది జాబితాను ప్రకటించనున్నారు.

దరఖాస్తు చేసుకునే విధానం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పట్టభద్రులైతే ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు ఫారంతో పాటు డిగ్రీ పాస్ మెమో, ప్రొవిజినల్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, ఓటరు ఎపిక్ కార్డు, పాస్‌పోర్టుసైజ్ ఫొటో, ఫోన్‌నంబర్, ఈమెయిల్ ఐడీ వంటి వివరాలతో దరఖాస్తు చేసుకోవచ్చు. 2021 నవంబర్ 11వ తేదీలోపు డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అర్హులు. ఉపాధ్యాయులైతే ఫారం -19 ద్వారా పైన తెలిపిన వివరాలు, సర్టిఫికెట్లతో పాటు అదనంగా గత ఆరేళ్ల నుంచి ఎక్కడ బోధిస్తున్నారనే వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. అందుకు సంబంధించిన సర్టిఫికెట్స్‌ను సైతం జత చేయాలి. ఆఫ్‌లైన్‌లో పూరించిన దరఖాస్తులను జిల్లాలోని ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో అందజేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో CEO.TELANGANA వెబ్‌సైట్‌లోకి వెళ్లి దరఖాస్తు చేసుకోవచ్చు. సంబంధిత ఫారాలను ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా పూరించడంతో పాటు సంబంధిత దరఖాస్తులను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని ఆదిలాబాద్ అర్బన్ తహసీల్దార్ సంపతి శ్రీనివాస్ తెలిపారు. నవంబర్ 6 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ సంబంధిత ఫారాలను నింపి దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

2019 ఎన్నికల ఓటరు జాబితా ప్రకారం ఉమ్మడి జిల్లాలోని ఓటర్ల వివరాలు

జిల్లా	కేటగిరి	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఆదిలాబాద్	పట్టభద్రులు	5,216	2,050	02	7.268
	టీచర్లు	1129	425	--	1554
నిర్మల్	పట్టభద్రులు	9,012	4,062	--	13,074
	టీచర్లు	1,188	427	--	1,615
మంచిర్యాల	పట్టభద్రులు	9,670	4,457	02	14,129
	టీచర్లు	840	435	--	1,275
కుమురంభీం	పట్టభద్రులు	3,282	1,154	01	4,437
	టీచర్లు	125	30	--	155

అవగాహన రాహిత్యంతో...

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉపాధ్యాయులు, పట్టభద్రులు అధికసంఖ్యలో ఉన్నప్పటికీ ఓటర్లుగా నమోదయ్యే వారి సంఖ్య మాత్రం చాలా తక్కువగా ఉంటోంది. అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా ఓటర్ల ఆధిపత్యం సాగిస్తుండగా, ఎమ్మెల్సీ ఎన్నికలకు వచ్చేసరికి అటు పట్టభద్రులు, ఇటు టీచర్లలో వారి సంఖ్య తక్కువగా ఉంటోంది. నాలుగు జిల్లాల పరిధిలో పట్టభద్రులైన ఓటర్లు 38,908 మంది ఉండగా టీచర్స్ ఓటర్లు కేవలం 4,599 మంది మాత్రమే ఉండటం పరిస్థితికి అద్దం పడుతోంది. నాలుగు జిల్లాల పరిధిలో నిరుద్యోగులు సుమారు 4 లక్షలకు పైగానే ఉంటారు. కానీ గత ఎన్నికల్లో ఓటర్లుగా నమోదు చేసుకున్న వారు కేవలం 38 వేల మంది మాత్రమే. ఇందులో ఉపాధ్యాయులు 4వేల మంది మాత్రమే నమోదు చేసుకున్నారు. ఓటరు నమోదుపై ఆయా జిల్లాల్లో నోటిఫికేషన్ విడుదల చేసేందుకే పరిమితమైన అధికారులు సరైన ప్రచారం కల్పించడం లేదు. ఎలా నమోదు చేసుకోవాలనే దానిపై యువతలో అవగాహన లేకపోవడం, ఓటరుగా ఎందుకు నమోదు చేసుకోవాలనే నిరాసక్తితో చాలా మంది గ్రాడ్యుయేట్స్ అంతగా ఆసక్తి చూపడం లేదు. వారికి అవగాహన కల్పించేలా అధికారులు సైతం ఎలాంటి అవగాహన కార్యక్రమాలను చేపట్టడం లేదు. దీంతో ఓటర్ల నమోదు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆశించిన స్థాయిలో జరగడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా అధికారులు ఆదిశగా దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బైండోవర్ అతిక్రమించిన వ్యక్తిపై కేసు నమోదు

కోటపల్లి: మండలంలోని శెట్‌పల్లి గ్రామానికి చెందిన తాండ్ర పోచయ్య గతంలో పేకాట ఆడుతూ పట్టుబడడంతో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయగా రూ.లక్ష రికవరీ చేస్తామని హెచ్చరించి వదిలిపెట్టారు. ఈనెల 3న పేకాట ఆడుతూ మళ్లీ పట్టుబడటంతో బైండోవర్ అతిక్రమించాడని కేసు నమోదు చేస్తూ రూ.లక్ష జరిమానా విధించినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. జరిమానా పత్రాన్ని సోమవారం పోలీస్ స్టేషన్‌లో అందజేశారు.

దాడికి పాల్పడిన ముగ్గురిపై..

నెన్నెల(బెల్లంపల్లి): మండలంలోని గన్‌పూర్ గ్రామానికి చెందిన అంగలి శేఖర్, వెంకటస్వామిపై మద్యం మత్తులో దాడి చేసిన తాండూర్ మండలం కాసిపేటకు చెందిన ముద్దం అనిల్, సాగర్, సంజయ్‌పై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. బాధితులిద్దరూ బైక్‌పై నెన్నెలకు వస్తుండగా వైన్‌షాపు ఎదుట రోడ్డుపై ఉన్న బైక్‌ను తీయాలని కోరగా ముగ్గురు కలిసి దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి కేసులో ఇద్దరి అరెస్టు

తాండూర్(బెల్లంపల్లి): గంజాయి కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని లింగధరిగూడకు చెందిన జయరాం తన ఇంటి సమీపంలోని పెరట్లో గంజాయి మొక్కలు పెంచుతున్నాడు. అవి ఎండిన తర్వాత తాండూర్ ఐబీ సుభద్రకాలనీకి చెందిన జునైద్‌ఖాన్‌కు విక్రయిస్తున్నాడు. అతను గంజాయి తయారుచేసి ఇతర వ్యక్తులకు అమ్మకాలు సాగిస్తున్నాడు. తమకు అందిన పక్కా సమాచారంతో గ్రామంలో తనిఖీలు నిర్వహించి ఏడు మొక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ రూ.70 వేల వరకు ఉంటుందని అంచనా వేశారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు.

ఉద్యోగం పేరిట మోసం

- నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్ చూపించి డబ్బు వసూలు
- నలుగురితో పాటు హెచ్‌ఎంపై కేసు నమోదు

నెన్నెల(బెల్లంపల్లి): ఉద్యోగం ఇప్పిస్తామని ఓ మహిళను నమ్మించి డబ్బులు వసూలు చేసిన నలుగురు వ్యక్తులతో పాటుగా నకిలీ ఆర్డర్‌ను గుర్తించకుండా విధుల్లో జాయిన్ చేసుకున్న హెచ్‌ఎంపై సోమవారం కేసు నమోదైంది. ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన బూడం స్వర్ణలతకు విద్యాంజలి పథకంలో అటెండర్ ఉద్యోగం ఇప్పిస్తానని నెన్నెలకు చెందిన బాపు నమ్మించాడు. ఖర్చులకు డబ్బులు ఇస్తే ఆర్డర్ తీసుకొస్తానని చెప్పాడు. మందమర్రికి చెందిన శ్రీనివాస్, గోదావరిఖనికి చెందిన తిరుమల, పెద్దపల్లికి చెందిన పిడుగు రవీందర్‌తో కలిసి పథకం ప్రకారం తప్పడు అపాయింట్‌మెంట్ ఆర్డర్ సృష్టించి స్వర్ణలతకు చూపించాడు. అది నిజమని నమ్మిన బాధితురాలు తన బంగారాన్ని బెల్లంపల్లిలో కుదువపెట్టి జులై 1న రూ.1.36 లక్షలు ఇచ్చి ఆర్డర్ తీసుకుంది. నకిలీ ఆర్డర్‌ను గుర్తించకుండా హెచ్‌ఎం ప్రకాష్ జాయిన్ చేసుకున్నారు. 40 రోజుల పాటు డ్యూటీ చేసింది. వేతనం ఇవ్వాలని హెచ్‌ఎంను కోరగా డీఈవో నుంచి పర్మిషన్ వస్తేనే ఇస్తామన్నారు. అనుమానం వచ్చి లెటర్ ఇచ్చిన వ్యక్తులను నిలదీయగా రూ.1.36 లక్షల చెక్కు తిరిగి రాసి ఇచ్చారు. ఆ చెక్కును బ్యాంకుకు తీసుకెళ్తే బౌన్స్ అయింది. తాను మోసపోయానని గ్రహించిన బాధితురాలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

బాధిత కుటుంబానికి రూ.15 లక్షల పరిహారం

జైపూర్: మండలంలోని టేకుమట్ల సమీపంలో శ్రీరాంపూర్ సీహెచ్‌పీ నుంచి ఎస్టీపీపీకి బొగ్గు రవాణా చేయడానికి నిర్మించిన రైల్వే‌ట్రాక్‌లైన్ పక్కన మట్టి కోసం తీసిన గుంతలో పడి గ్రామానికి చెందిన చిప్పకుర్తి రాజ్‌కుమార్ అనే బాలుడు మృతి చెందిన విషయం తెలిసిందే. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని స్థానికులు మృతదేహంతో ఆందోళన నిర్వహించారు. విషయాన్ని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సింగరేణి ఉన్నతాధికారులతో మాట్లాడి రూ.15 లక్షల నష్టపరిహారంతో పాటు బాధిత కుటుంబంలో ఒకరికి ఎస్టీపీపీలో ఉద్యోగం ఇప్పిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృతదేహానికి సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు.

ముగ్గురిపై కేసు నమోదు

బోథ్: వాట్సాప్ గ్రూపుల్లో తప్పుడు ప్రచారాలు చేసిన ముగ్గురిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మార్చిలో జరిగిన ఓ సంఘటనపై ఆదివారం పలు వాట్సాప్ గ్రూపుల్లో తప్పుడుగా ప్రచారం చేశారని బోథ్ సీహెచ్‌సీ సూపరింటెండెంట్ రాజనాల రవీంద్ర ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

పాత కక్షలతో ఒకరిపై కత్తితో దాడి


గాయపడిన శ్రీనివాస్

కడెం: పాత కక్షలతో ఒకరిపై కత్తితో దాడి చేసిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణ సాగర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు మండలంలోని కొత్త మద్దిపడగ గ్రామానికి చెందిన మక్కి శ్రీనివాస్, నక్కలపేట్ అశోక్‌కు కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో శ్రీనివాస్‌ను ఎలాగైనా చంపాలని నిర్ణయించుకున్న అశోక్ సోమవారం ఉదయం అతడి ఇంటికి వెళ్లి గొడవకు దిగాడు. ఎదిరించిన శ్రీనివాస్‌పై తన వెంట తెచ్చుకున్న కత్తితో దాడి చేశాడు. తీవ్రగాయాలు కావడంతో నిర్మల్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు నిందితుడు నక్కలపేట్ అశోక్‌పై కేసు నమోదు చేసి, 14 రోజుల రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

కోయంబత్తూర్‌లో ఆదివాసీ కళాకారుల ప్రదర్శన


ప్రదర్శనలో పాల్గొన్న దూబార్‌పేట్ కళాకారులు

ఇచ్చోడ(బోథ్): నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని దూబార్‌పేట్ గ్రామానికి చెందిన ఆదివాసీ కళాకారులు ఆదివారం రాత్రి కోయంబత్తూర్‌లో గుస్సాడీ, డెంసా నృత్య ప్రదర్శనలు ఇచ్చి పలువురిని అలరించారు. ఆదివాసీ సకల కళా సంక్షేమం సంఘం డైరెక్టర్ కాత్లే శ్రీధర్ ఆధ్వర్యంలో బృందం సభ్యులు కోయంబత్తూర్‌లోని ఈశా యోగాసెంటర్‌లో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి ఆనంద్ కాత్లే, లక్ష్మణ్, సలాం జల్కర్‌దేవి, మెస్రం ప్రకాష్, గంగారాం, రాము, తులసి, సరస్వతి, వనిత, సుజాత, లలిత, జగదీష్, అనిల్ పాల్గొన్నారు.

వంకులంలో చోరీ


ఇంట్లో పరిశీలిస్తున్న ఎస్సై చంద్రశేఖర్

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని వంకులంలో చోరీ జరిగినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. గ్రామానికి చెందిన బోర్కుడే నానాజీ ఆరోగ్యం బాగా లేకపోవటంతో ఈనెల 4వ తేదీన ఇంటికి తాళం వేసి భార్యతో కలిసి కాగజ్‌నగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాడు. మూడు రోజుల పాటు అక్కడే చికిత్స పొందిన తర్వాత ఆదివారం సాయంత్రం ఇంటికి చేరుకున్నారు. ఇంటి తాళం తీసి లోపలికి వెళ్లి చూడగా ఇంటి వెనుకాల ఉన్న తలుపులు పగులగొట్టి ఉన్నాయి. అనుమానం వచ్చి ఇంట్లో ఉన్న కర్ర బీరువాలో చూడగా బట్టలు చెల్లాచెదురుగా పడేసి ఉన్నాయి. అందులో దాచుకున్న 6 బంగారు ఉంగరాలతో పాటు 10 తులాల వెండి పట్టీలు, 2 తులాల వెండి లక్ష్మీ ప్రతిమతో పాటు 5 తులాల వెండి పళ్లెం కనిపించలేదు. చోరీ జరిగినట్లు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. చోరీకి గురైన వస్తువుల విలువ సుమారు రూ.98,500 వరకు ఉంటుందని బాధితుడు వాపోయాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నాడి పట్టకుండా వైద్యమా?


డాక్టర్‌కు, రోగులకు మధ్యలో కట్టిన తాడును పరిశీలిస్తున్న టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్

నిర్మల్ జిల్లా కేంద్రంలో టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ సోమవారం పర్యటించారు. జిల్లా ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ చూస్తున్న డాక్టర్ గదిని సందర్శించారు. అక్కడ డాక్టర్‌కు, రోగులకు మధ్య దూరం పాటించేలా తాడు కట్టి ఉండడం గమనించారు. రోగులకు చికిత్స ఇలాగే చేస్తారా అని డాక్టర్‌ను ప్రశ్నించారు. నాడి పట్టకుండా రోగం ఎలా నిర్ధారిస్తారని వైద్యుడిని మందలించారు. డాక్టర్‌కు ఉండాల్సిన లక్షణాలు ఇవేనా అని ప్రశ్నించారు. దీంతో వైద్యులు వెంటనే తాడు తొలగించారు. అక్కడే మరో మహిళా డాక్టర్ స్టెతస్కోప్ లేకుండా ఓపీ చూస్తుండడం గమనించి వైద్యం ఎలా చేస్తారని ప్రశ్నించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా


అర్జీలు స్వీకరిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలనుంచి అర్జీలు స్వీకరించారు. ఉట్నూర్ మండలం బీర్సాయిపేటకు చెందిన కొమురం రాంబాయి గొర్రెల రుణాలు ఇప్పించాలని, ఆదిలాబాద్ మండలం తలమద్రికి చెందిన నాగోరావు ట్రైకార్ రుణం మంజూరు చేయాలని, లింగాపూర్ మండలం మేడిగూడకు చెందిన తొడసం భగవంత్‌రావు భూమి ఇప్పించాలని, ఆదిలాబాద్ మండలం తిప్పరాజగూడకు చెందిన కొడప భీంరావు ఎడ్ల జత ఇప్పించాలని కోరారు. పింఛన్, డబుల్ బెడ్రూం ఇళ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయం, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమంలో ఏడీఎంఅండ్‌హెచ్‌వో మనోహర్, ఏవో దామోదర్, పీహెచ్‌వో సందీప్‌కుమార్, జేడీఎం నాగభూషణం, పెసా కోఆర్డినేటర్ వసంత్‌రావు, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీడీఏ పీవోకే అధికారం ఇవ్వాలి


పీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజనులు సాగు చేసే భూముల (సివిల్) సమస్యల పరిష్కారానికి ఐటీడీఏ పీవోకే పూర్తి హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఐటీడీఏ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావు, నాయకులు కొడప నగేశ్, తిరుపతి కుడిమెత, సోయం రాందాస్ మాట్లాడుతూ ఐటీడీఏ పీవోగా ఐఏఎస్ అధికారి ఉండడం, గిరిజన గ్రామాల్లో క్షేత్ర పర్యటనలు చేసిన సందర్భంలో గిరిజన స్థితిగతులు, సమస్యలపై పూర్తి అవగాహన ఉంటుందన్నారు. కానీ ఏజెన్సీ భూములపై సివిల్ కేసులను పరిష్కరించే అధికారం ఐటీడీఏ పీవోకు లేదని, సంబంధిత కేసులను కలెక్టర్‌కు బదిలీ చేయాలని హైకోర్టు ఆగస్టులో తీర్పు ఇచ్చిందన్నారు. దీంతో గిరిజనులు అన్ని విధాలుగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అనంతరం ఐటీడీఏ పీవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తుడుందెబ్బ నాయకులు దత్తు, మనోజ్, భరత్, జంగుదేవ్, నాగ్‌నాథ్, ఆడ హన్మంత్‌రావు, రోషన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో రోగులకు నాణ్యమైన వైద్యసేవలు

- టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్


రోగితో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందుతున్నాయని తెలంగాణ రాష్ట్ర వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిని తనిఖీ చేశారు. రిమ్స్‌లోని ఎంఐసీయూ, ఐసీయూ, నెఫ్రో వార్డు, ఆర్ఐసీయూ, సూపర్ స్పెషాలిటీలోని ఐసీయూ, యూరాలజీ తదితర వార్డులను పరిశీలించారు. అందుతున్న సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి చర్యలు చేపడతామన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో కిడ్నీ ఆపరేషన్లు జరుగుతున్నాయని, రోగులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మందుల కొరత తీర్చేందుకు అన్ని జిల్లాల్లో సెంట్రల్ డ్రగ్ స్టోర్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రిమ్స్‌కు కంపౌండ్ వాల్ నిర్మించాలని, ఆడిటోరియంలో సెంట్రల్ ఏసీని ఏర్పాటు చేయాలని, రిమ్స్ ఆస్పత్రి నుంచి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి వెళ్లేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించేలా చర్యలు చేపట్టాలని డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ కోరారు. రిమ్స్‌లో మూడు లిఫ్టులు పనిచేయడం లేదని, కొత్తగా లిఫ్టులను ఏర్పాటు చేయాలని, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో కార్డియాలజీ వైద్యుడిని నియమించాలని విన్నవించారు. ఆయన వెంట వైద్యులు తిప్పస్వామి, తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో సత్తా


ఆదిలాబాద్ : విజేతలుగా నిలిచిన బాక్సర్లు



గోల్డ్‌మెడల్ సాధించిన క్రితి అగర్వాల్

ఆదిలాబాద్/మంచిర్యాలటౌన్: హైదరాబాద్‌లోని షేక్‌పేటలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో ఉమ్మడి జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. ఈ నెల 5, 6 తేదీల్లో నిర్వహించిన సబ్ జూనియర్ బాలబాలికల పోటీల్లో మంచిర్యాలకు చెందిన క్రితి అగర్వాల్ గోల్డ్‌మెడల్ సాధించినట్లు కోచ్ రాజేశ్ తెలిపారు. సోమవారం నిర్వహించిన పోటీల్లో ఆదిలాబాద్ క్రీడా పాఠశాలకు చెందిన టీ. నిహారిక, అనూష గోల్డ్ మెడల్, వివేకవర్ధిని సిల్వర్ మెడల్ సాధించినట్లు కోచ్ సాయికుమార్ తెలిపారు.